క్లుప్తంగా

దళిత బంధు యూనిట్ల పరిశీలన

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులోని దళిత బంధు యూనిట్లను గురువారం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సంజీవరావు, జూలూరుపాడు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ తాళ్లూరి రవి పరిశీలించారు. ఈ సందర్భంగా దళిత బంధు పథకం ద్వారా లబ్ధిదారులు ఏర్పాటు చేసిన దుకాణాల్లో రికార్డుల నిర్వహణ, స్టాక్ వివరాలు, ఆర్థిక లావాదేవీలను అధికారులు పరిశీలించారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సంజీవరావు మాట్లాడుతూ... దళితుల అభ్యున్నతి కోసమే ప్రభుత్వం దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తోందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో దళిత బంధు లబ్ధిదారులు మోదుగు రామకృష్ణ, పణితి వెంకటేశ్వర్లు, వేల్పుల నరసింహారావు, దేవరకొండ రమేష్ పాల్గొన్నారు.

వేద విద్యా క్యాలెండర్లు ఆవిష్కరణ

కొత్తగూడెంరూరల్: బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో వేద విద్యా పరిషత్ నూతన ఉగాది క్యాలెండర్లను సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్వీకే శ్రీనివాస్ చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు ఉదయభాస్కర రామ్మోహన్‌శర్మ, తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఉపాధ్యక్షుడు బ్రహ్మశ్రీ దండిభట్ల రామనుజన్‌కుమార్ శర్మ, యువజన ఉపాధ్యక్షుడు గిరీష్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

కొత్తగూడెంటౌన్: జిల్లా బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన రమేష్‌కుమార్ మక్కడ్‌ను గురువారం గాంధీపథం కన్వీనర్ చింతలచెరువు గెర్షోం, రిటైర్డ్ జడ్జి శాంతారామ్ సన్మానించారు. శాంతారామ్ మాట్లాడుతూ.. కొత్తగూడెంకు జిల్లా ఫ్యామిలీ కోర్టు, జిల్లా ఎస్టీ, ఎస్సీ కోర్టు, వినియోగదారుల ఫోరం కోర్టు, లేబర్ కోర్టుల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.

వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

కొత్తగూడెంఅర్బన్: ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జేవీఎల్ శిరీష వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, హెల్త్ వెల్నెస్ సెంటర్లలో పోస్టర్లు అంటించాలని, శుక్రవారం ర్యాలీలు నిర్వహించి క్షయ వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. వివిధ శాఖ లలో కూడా ప్రచార నిమిత్తం పోస్టర్లు అంటించి అవగాహన కల్పించాలని కోరారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా భద్రాచలంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆధ్వర్యంలో కొత్తగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఇఫ్టూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ఇల్లెందురూరల్: ఏప్రిల్ 2, 3 తేదీలలో కొత్తగూడెంలో నిర్వహించనున్న ఇఫ్టూ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ టైల్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాంసింగ్ పిలుపునిచ్చారు. మండలంలోని ఒడ్డుగూడెం గ్రామపంచాయతీ ఉషా టైల్స్‌లో గురువారం ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా సంపద సృష్టికర్తలు కార్మికులేనని, వారి శ్రమకు తగిన ఫలితం లేకుండా పోయిందన్నారు. కార్మికుల కష్టానికి ఫలితం దక్కేలా చట్టాలను సవరించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్ పోరాటాల నిర్మాణం లక్ష్యంగా రాష్ట్ర మహాసభలు ఉంటాయని, కార్మికులు మహాసభలకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

దోషులను శిక్షించండి

ఇల్లెందు: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీ దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌ఏ నబీ డిమాండ్ చేశారు. గురువారం ఇల్లెందులో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. లీకేజీ వల్ల లక్షల మంది నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. టీఎస్‌పీఎస్సీలో చోటు చేసుకున్న పరిణామాల మీద దర్యాప్తును వేగం చేయాలని కోరారు.

కొత్తగూడెంఅర్బన్: గ్రూప్-1 ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. లీకేజీ వ్యవహారంలో సీఎం కార్యాలయంతో పాటు టీఎస్ పీఎస్సీకి చెందిన సభ్యులకు భాగస్వామ్యం ఉందని ఆరోపించారు.

ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య

ఇల్లెందురూరల్: పట్టణంలోని ఇల్లెందులపాడుకు చెందిన రత్తారపు శ్రీనివాస్ (42) గురువారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్టీసీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకొని తలుపులు తీయడంతో శ్రీనివాస్ తాడుకు వేలాడుతూ కనిపించాడు. ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి చేర్చారు. అప్పటికే శ్రీనివాస్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వారం గడువు.. వీడని కలవరం

గతంలో ఎన్నడూ లేనంతగా మండలంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరయ్యాయి. ఆ నిధులను మండల వ్యాప్తంగా ఎనిమిది గ్రామపంచాయతీలకు కేటాయించారు. ఒక్కో గ్రామపంచాయతీకి కనిష్టంగా రూ. 20 లక్షలు, గరిష్టంగా రూ.40 లక్షలు. ఆయా పనులను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలనే నిబంధనను కేంద్ర ప్రభుత్వం విధించింది. లేదంటే నిధులు వెనక్కు వెళ్లి పోతాయి.


సీఎస్పీ బస్తీలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు

- 'ఉపాధి'సీసీ రోడ్లకు నిర్మాణానికి కాంట్రాక్టర్లు ససేమిరా
- ఈ నెలాఖరుతో ముగియనున్న గడువు
- రూ.30 లక్షల నిధులు వెనక్కి?

ఇల్లెందురూరల్: మండలానికి మంజూరైన రూ.2 కోట్ల నిధులలో సుభాష్‌నగర్, బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీలకు రూ.40 లక్షలు చొప్పున, రేపల్లెవాడ, సీఎస్పీ బస్తీ, మస్సివాగు, మామిడిగుండాల, ధనియాలపాడు, ఒడ్డుగూడెం గ్రామపంచాయతీలకు రూ.20 లక్షల చొప్పున కేటాయించారు. ఆయా గ్రామపంచాయతీలకు నిధులు కేటాయిస్తూ జనవరి 13వ తేదీన పరిపాలనపరమైన అనుమతులు మంజూరయ్యాయి.

ప్రజాప్రతినిధులకు తప్పని ఇబ్బంది...

గతానుభావాలను దృష్టిలో పెట్టుకొని మండలంలో కాంట్రాక్టర్లు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా మంజూరైన సీసీ రహదారులు నిర్మించేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో పనులు పూర్తి చేసుకోవాల్సిన బాధ్యత తమ భుజస్కందాలపై పడటంతో ప్రజాప్రతినిధులు మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటివరకు నిధులు అత్యధికంగా మంజూరైన సుభాష్‌నగర్, బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీలలో స్థానిక ప్రజాప్రతినిధులు పనులు పూర్తిచేశారు. ధనియాలపాడు, రేపల్లెవాడ గ్రామపంచాయతీలలో స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని కాంట్రాక్టర్ల ద్వారా పనులు పూర్తి చేయించారు. ఇక సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీలో ప్రస్తుతం పనులు కొనసాగుతుండగా ఒడ్డుగూడెం, మస్సివాగు గ్రామపంచాయతీలలో ఎనిమిది సీసీ రోడ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు నాలుగు రోడ్ల చొప్పున పనులు పూర్తి చేశారు. మస్సివాగులో మిగతా రెండు రోడ్లు పూర్తి చేసేందుకు ఏర్పాట్లు జరుగుతుండగా ఒడ్డుగూడెం గ్రామపంచాయతీలో మిగిలిన రెండు పనులు ప్రారంభించేందుకు కాంట్రాక్టర్ కోసం అన్వేషణ జరుగుతోంది. ఇక మిగిలిన మామిడిగుండాలలో ఇప్పటివరకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో పనులకు ముహూర్తం కుదరడం లేదు.

నెలాఖరుతో ముగియనున్న గడువు..

ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో భాగంగా మండలానికి మంజూరైన రూ.2కోట్ల నిధులను మొత్తంగా 43 పనులకు కేటాయించారు. ఇందులో ఇప్పటి వరకు రూ.1.40 కోట్ల విలువ గల 36 పనులు పూర్తి కాగా రూ.20 లక్షలు విలువ చేసే నాలుగు పనులు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయి. ఈ నెలాఖరుతో పనులు చేసేందుకు ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగుస్తుడటంతో ఇప్పటివరకు జరిగిన పనులను బట్టి రూ.30 లక్షల నిధులు వెనక్కు వెళ్లనున్నాయి.

రెండు మండలాలకు అధికారి ఒక్కడే..


ఒడ్డుగూడెంలో సీసీ రోడ్డు నిర్మించాల్సిన అంతర్గత రహదారి

ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులను పర్యవేక్షించాల్సిన బాధ్యతను పంచాయతీరాజ్ శాఖ తీసుకుంది. ఆ శాఖకు సంబంధించి ఇల్లెందు, టేకులపల్లి మండలాలకు ఒక్కడే ఏఈ ఉండటంతో పనుల పురోగతి, నాణ్యత పరిశీలన ప్రశ్నార్థకంగా మారింది. గడువు సమీపించిన తరువాత హడావుడిగా జరుగుతున్న పనులు ఏ మేరకు నాణ్యతతో ఉంటాయో గతంలో వేసిన రహదారులను పరిశీలిస్తే ఇట్టే అర్థమవుతుంది. అంతేకాకుండా చేసిన పనులకు బిల్లులు సిద్ధం చేసి గడువులోగా ఆన్‌లైన్ చేయాల్సిన బాధ్యత కూడా ఉండటం.. పనులన్నీ ఒకేసారి చివరి దశకు చేరుకోవడంతో అధికారులు నాణ్యత పరిశీలన కంటే బిల్లులు, రికార్డులపైనే దృష్టి సారించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఏమీ చేయలేక పోతున్నాం



గ్రామపంచాయతీకి ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో భాగంగా ఏడు పనులకు గాను రూ.20 లక్షలు మంజూరయ్యాయి. ఇప్పటికే గ్రామపంచాయతీ పరిధిలో చేసిన పలు అభివృద్ధి పనులకు బిల్లులు రాక చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నాం. దీంతో ఇప్పుడు మంజూరైన సీసీ రోడ్ల పనులు చేయించలేక పోతున్నాం.

– కుంజ కృష్ణ, సర్పంచ్, మామిడిగుండాల

కాంట్రాక్టర్‌ను వెతుకుతున్నాం



ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో బాగంగా గ్రామపంచాయతీకి రూ.20 లక్షలు మంజూరయ్యాయి. ఇప్పటివరకు రూ.పది లక్షల వ్యయంతో రెండు పనులు పూర్తి చేశాం. మిగతా పనులు చేసే ఆర్థిక స్థోమత లేదు. నిధులను సద్వినియోగం చేసుకునేందుకు ప్రయత్నిస్తునాం. పనిచేసే కాంట్రాక్టర్ కోసం వెతుకుతున్నాం.

– చాట్ల భాగ్యమ్మ, సర్పంచ్, ఒడ్డుగూడెం

సద్వినియోగం చేసుకుంటాం



ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో భాగంగా మండలానికి మంజూరైన రూ.2కోట్ల నిధులను సద్వినియోగం చేసుకునేలా ప్రయత్నిస్తున్నాం. రెండు గ్రామపంచాయతీలలో రూ.30 లక్షలు విలువ చేసే తొమ్మిది పనులు ఇంకా ప్రారంభం కాలేదు. మిగతా పనులన్నీ రెండు రోజుల్లో పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించాం.

– రాజు, ఏఈ, పంచాయతీరాజ్ శాఖ, ఇల్లెందు మండలం

11వ వేజ్‌బోర్డ్ సమావేశం నిర్వహించాలి



గేట్ మీటింగ్‌లో బీఎంఎస్ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): 11వ వేజ్‌బోర్డ్ 8వ సమావేశంలో 19శాతం మినిమమ్ గ్యారెంటీ బెనిఫిట్స్ సాధించటం చారిత్రాత్మకమైన ఒప్పందమని, కానీ ఇంతవరకు ఎలాంటి అగ్రిమెంట్ చేయలేదని వెంటనే సమావేశం నిర్వహించి కార్మికులకు వచ్చే అదనపు బెనిఫిట్స్‌పై చర్చించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. గురువారం కొత్తగూడెం ఏరియాలోని గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. అవిశ్రాంత పోరాటాలు, కార్మికవర్గం ఆందోళనకు దిగుతారని భావించిన యాజమాన్యం ఆగమేఘాల మీద సమావేశం నిర్వహించి 19 శాతం ఎంజీబీని ప్రకటించి సర్క్యులర్‌ను విడుదల చేయక పోవటం సరైంది కాదన్నారు. వెంటనే 9వ సమావేశం నిర్వహించేందుకు యాజమాన్యం ఒత్తిడి తేవాలని కోరారు.

సంస్థకు రావాల్సిన సుమారు రూ.25 వేల కోట్లను వెంటనే చెల్లించాలని లేదంటే యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఏరియా ఉపాధ్యక్షుడు మొగిలిపాక రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రావణ్, వినయ్, నాగ ప్రసాద్, విజయ్‌కుమార్, కే.శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్, ఎం.సురేష్, కుమారస్వామి, ఇనుపనూరి నాగేశ్వరరావు, నిర్మల, అంకం రాజ్‌కుమార్, మోసం మల్లికార్జున్, రంజిత్‌కుమార్, కుమారస్వామి, ఆనంద్, అబిద్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

గోటి తలంబ్రాల తయారీకి శ్రీకారం

పాల్వంచ: ఈనెల 30న శ్రీరామ నవమి పురస్కరించుకుని శ్రీసీతారాముల కల్యాణం సందర్భంగా స్థానిక శాస్త్రీరోడ్డులోని రామాలయంలో తలంబ్రాలను గోటితో వొలిచే కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వేదపండితులు గోపాలాచార్యులుచే ప్రారంభించారు. ఆలయ ఈఓ రజినికుమారి మాట్లాడుతూ.. 29వ తేదీ వరకు భక్తులు ఇళ్ల వద్ద గోటి తలంబ్రాలు వొలిచి మేళతాళాలతో దేవాలయానికి తీసుకొస్తారని చెప్పారు. చలవాది ప్రకాశ్, చలవాది రాజ్యలక్ష్మి, స్రవంతి, శ్రీదేవి, ధనలక్ష్మి, అశ్విని, శిరీష పాల్గొన్నారు.

నేడు ప్రశంసాపత్రాలు అందజేత

సుజాతనగర్: నేషనల్ పంచాయతీ అవార్డుల్లో భాగంగా మార్కుల అధారంగా, థీముల వారీగా ఎనిమిది గ్రామ పంచాయతీలకు శుక్రవారం ప్రశంసాపత్రాలను అందజేయనున్నట్లు ఎంపీడీఓ కార్యాలయం నుంచి గురువారం ఒక ప్రకటన వెలువడింది. మొత్తం 27 అవార్డులు దక్కాయి. స్థానిక రైతు వేదికలో వీటిని అందజేయనున్నామని సర్పంచులు, ఎంపీటీసీలు సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

పాల్వంచరూరల్: మండలంలోని 36 గ్రామపంచాయతీల్లో ఏడు అంశాల్లో ఉత్తమ పనితీరును చూపిన 27 గ్రామపంచాయతీలకు జాతీయ అవార్డులు లభించినట్లు ఎంపీడీఓ జి.రవీంద్ర ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అవార్డులు, ప్రశంసా పత్రాలను నేడు జగన్నాథపురంలోని రైతువేదికలో సర్పంచ్‌లకు అందజేయనున్నట్లు తెలిపారు.

వైద్య శిబిరానికి అనుమతి ఇవ్వొద్దు

సుజాతనగర్: జీఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 26న సుజాతనగర్ హైస్కూల్లో నిర్వహించనున్న వైద్య శిబిరానికి అనుమతి ఇవ్వొద్దని ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం ఆధ్వర్యంలో గురువారం డిప్యూటీ తహసీల్దార్, పాఠశాల హెచ్‌ఎంలకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్ మాట్లాడుతూ.. రాజకీయ కోణంతోనే వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాసేవ అంటూనే రాజకీయ ప్రవేశానికి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు బుచ్చయ్య, నాయకులు మూడు రాందాస్ నాయక్, పృథ్వీనాయక్, జానకీరాం, చంద్రు నాయక్, కృష్ణానాయక్, భావ్‌సింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అమరుల స్ఫూర్తితో యువత ఉద్యమించాలి


సింగరేణి(కొత్తగూడెం): నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్యమించడమే భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లకు నిజమైన నివాళి అని పలువురు వక్తలు అన్నారు. గురువారం కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లోని పలుచోట్ల ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో అమరులల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం వారు చేసిన త్యాగాలను గుర్తు చేసుకున్నారు. పీడీఎస్‌యూ, పీవైఎల్, ఏఐవైఎఫ్, సీపీఐ ఆధ్వర్యంలో వేర్వేరుగా కాగడాల ప్రదర్శన నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్


ఇల్లెందురూరల్: కొమరారంలో మానవహారం నిర్వహిస్తున్న పీవైఎల్, పీడీఎస్‌యూ కార్యకర్తలు


పాల్వంచ: అంబేద్కర్ సెంటర్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో..


టేకులపల్లి సెంటర్‌లో పీవైఎల్ ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన



టేకులపల్లి సెంటర్‌లో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో..

భజన మందిరానికి పూర్వవైభవం..

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం భజన మందిరానికి పూర్వ వైభవం తీసుకొస్తానని, భక్తుల కోరిక మేరకు ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలను అందిస్తానని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావు అన్నారు. గురువారం పట్టణంలోని భజన మందిరంలోని సాయిబాబా గుడి నిర్మాణానికి కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావు భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్, ఈఓ చంద్రశేఖర్, కౌన్సిలర్లు రుక్మాంగదర్ బండారి, బలిశెట్టి సత్యభామ, అంబుల వేణు, బీఆర్ఎస్ నాయకులు ఎం.రజాక్, బీమా శ్రీధర్, రావి రాంబాబు, యూసఫ్, క్లాసిక్ దుర్గ, పూర్ణ, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావు

రేపు కేన్సర్ స్క్రీనింగ్ శిబిరం

సూపర్‌బజార్(కొత్తగూడెం): చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ బసవతారకం కేన్సర్ ఆస్పత్రి వైద్యుల బృందం సహకారంతో ఈనెల 25, 26న కొత్తగూడెం క్లబ్‌లో కేన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించానున్నారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ అశోక చక్రవర్తి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేన్సర్ అనుమానిత లక్షణాలు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కురుపులు, ఏదైనా శరీర భాగాలలో వాపు రావడం, కణుతులు, రోజులు తరబడి అజీర్ణ సమస్య, ఆహారం మింగడం కష్టంగా ఉండడం తదితర లక్షణాలుంటే పరీక్షలు చేయించుకోవచ్చని సూచించారు. వ్యాధి నిర్ధారణ జరిగిన తెల్ల రేషన్ కార్డుదారులకు హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత చికిత్స పొందే అవకాశం ఉందని తెలిపారు. క్యాంపుకు వచ్చేవారు 9885630479, 9391190522 నంబర్లలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

ఘనంగా పోషణ్ పక్వాడా వారోత్సవాలు


ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్ అనురాధ

టేకులపల్లి: ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు పరిధిలోని టేకులపల్లి మండలంలో గురువారం పోషణ్ పక్వాడా వారోత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. టేకులపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ కె.అనురాధ ఆధ్వర్యంలో గోలియా తండా పంచాయతీ పరిధి వాగొడ్డు తండా అంగన్‌వాడీ కేంద్రంలో, గంగారం సెక్టార్ సూపర్ వైజర్ ఎం.లక్ష్మి ఆధ్వర్యంలో ఒడ్డుతండా, శంభునిగూడెం, లచ్చగూడెం, కిష్టారం, సంపత్‌నగర్, చింతోనిచెలక, చంద్రుతండా అంగన్‌వాడీల్లో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, తల్లిదండ్రులు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, గ్రామపెద్దలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాల వల్ల కలిగే లాభాలు తెలియజేశారు. చేతులను ఎలా శుభ్రం చేసుకోవాలో వివరించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని తెలిపారు. అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. సులానగర్, బోడు, బొమ్మనపల్లి సెక్టార్లలో సూపర్‌వైజర్లు నిర్మల, సక్కుబాయి, యశోదల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. మద్రాస్‌తండా పంచాయతీ కొండెంగులబోడు అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మాళోతు రాజేందర్‌నాయక్, టీచర్లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకుందాం..

జూలూరుపాడు: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ హాథ్ సే హాథ్ జోడో యాత్రకు కొనసాగింపుగా జూలూరుపాడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొడ్డు కృష్ణయ్య ఆధ్వర్యంలో నాయకులు గురువారం కొమ్ముగూడెం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజల కష్టాలు తీరాలంటే ఇందిరమ్మ రాజ్యం మళ్లీ రావాలని కోరుతూ ఇంటింటికి వెళ్లి రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిపించాలని కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కాంగ్రెస్ నాయకులు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేయనున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లకావత్ లచ్చు నాయక్, చాపలమడుగు నరసింహారావు, తాళ్లూరి అచ్చయ్య, మందా బాబు, ఎర్రబాబు, కత్రం ప్రసాద్, బానోత్ కిషన్, భూక్యా చందర్, బానోత్ లచ్చిరామ్, బోడా లఘుపతి, లకావత్ సూర్య, తదితరులు పాల్గొన్నారు.


కొమ్ముగూడెంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్టు

సుజాతనగర్: సీఎం కేసీఆర్ ఖమ్మం పర్యటన నేపథ్యంలో స్థానిక పోలీసులు కాంగ్రెస్ నాయకులను గురువారం మందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు నాగా సీతారాములు మాట్లాడుతూ.. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్క చేస్తున్న పాదయాత్రలతో సీఎం కేసీఆర్‌కు భయం మొదలైందన్నారు. పంట నష్టపోయిన రైతులను పార్టీలకు అతీతంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చింతలపూడి రాజశేఖర్, బానోత్ కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: సీఎం ఖమ్మం జిల్లా పర్యటన నేపథ్యంలో గురువారం జూలూరుపాడు పోలీసులు ముందుస్తుగా కాంగ్రెస్ పార్టీ నాయకులను అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో మాళోత్ మంగీలాల్ నాయక్, నున్నా కృష్ణయ్య, వాంకుడోత్ కిషన్ నాయక్, కొలిపాక వెంకటేశ్వర్లు, కొమ్మినేని రాంబాబు, కొలిపాక శ్రీనివాసరావు గుగులోత్ శ్రీనివాసరావు, బానోత్ మంగు నాయక్, గుగులోత్ బాలాజీ, బాదావత్ సామ్యా నాయక్, బానోత్ రాములు తదితరులు ఉన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయండి


మాట్లాడుతున్న హరిలాల్‌నాయక్

టేకులపల్లి: పెండింగ్ బిల్లుల విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్ వద్ద యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరిలాల్ నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం కోయగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల వేతనాలను ప్రతి నెల ఒకటో తేదీన చెల్లించాలని, ఈ- కుబేర్‌లో నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న ఎయిడెడ్ టీచర్ల వేతనాలు, సప్లమెంటరీ వేతనాలు, సెలవు జీతాలు, టీఎస్‌జీఎల్ఐ, జీపీఎఫ్ క్లైయిములు, పీఆర్‌సీ బకాయిలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పెన్షన్ బకాయిలు వెంటనే వ్యక్తిగత ఖాతాలలో జమ చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. పెండింగ్ బిల్లులు 24వ తేదీ లోపు జమ చేయకపోతే ఈనెల 28న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ధర్నా చౌక్‌లో ధర్నా చేయనున్నట్లు తెలిపారు.

అటెన్షన్ ప్లీజ్

అంగన్‌వాడీ కేంద్రంలో తాగునీరు కరువు

టేకులపల్లి మండలం దాసుతండా పంచాయతీ లచ్చతండా అంగన్‌వాడీ కేంద్రంలో తాగునీరు లేక చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అవస్థలు పడుతున్నారు. వీరు ప్రతిరోజు ఈ కేంద్రానికి పోషకాహారం కోసం వస్తుంటారు. చిన్నారులు ఉదయం సాయంత్రం వరకు కేంద్రంలోనే ఉంటారు. కానీ ఇక్కడ మంచినీటి సదుపాయం లేదు. బోరు ఉంది కానా పైన హ్యాండ్ లేదు. వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా ఉంది. దీంతో టాయిలెట్స్ వినియోగం లేదు. వర్షం వస్తే వరద నీరు అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలోనే నిలుస్తాయి. ఈ సమస్యలు అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.



\- టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : శరత్‌చంద్ర,
కార్యదర్శి, దాసుతండా పంచాయతీ
సెల్ నంబర్ : 99085 04480